క్లుప్తంగా

పీఎం కిసాన్‌తో అన్నదాతలకు మేలు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కారంచేడు: ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజనను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మువ్వల రమణ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు చినవంతెన సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ పథకం ద్వారా అన్నదాతలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరవపల్లి కుమార్, కే వెంకటేశ్వర్లు, టీ చంద్ర, లాలా భాస్కర్, శంకరశెట్టి నాగేశ్వరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

చీరాల: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు విద్యుత్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ జిల్లా సెషన్స్ జడ్జి విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. గురువారం స్థానిక పాపరాజుతోటలోని ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చీరాల డివిజన్ పరిధిలో విద్యుత్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం చీరాల డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని అర్జీల రూపంలో స్వీకరించారు. కార్యక్రమంలో ఈఈ సూర్యప్రకాష్, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊడి పడిన పెచ్చులు



కుర్చీపై పడిన సిమెంట్ పెచ్చులు

కారంచేడు: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాతబడిన పశువైద్యశాల పైకప్పు గురువారం అకస్మాత్తుగా ఊడిపడింది. ఆ సమయంలో అప్పటి వరకు అక్కడే కూర్చొని ఉన్న పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్‌కు ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆసుపత్రి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవన నిర్మాణం కాకపోయినా కనీస మరమ్మతులు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై దృష్టి పెట్టి కనీస మరమ్మత్తులు చేయించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మరింత ఆరోగ్యం



యద్దనపూడి: గ్రామాల్లో ఇంటివద్దకే వచ్చి అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుభాషిణి నిహారిక పేర్కొన్నారు. గురువారం మండలంలోని గన్నవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బాలింతలు, గర్భిణులకు, శిశువులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారి నిహారిక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

లైబ్రరీకి 821 పుస్తకాలు అందజేత



చీరాల అర్బన్: చీరాల మండలంలోని వాడరేవు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎస్‌ఆర్‌ఐ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వివిధ రకాల 821 పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయానికి అందించిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పుస్తకాలు చదవడం వలన ఎన్నో కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బాపనపల్లి రమేష్, వలివేటి మురళీకృష్ణ, హెచ్‌ఎం పి.రాధారాణి, సమన్వయకర్త సిఎ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎం.లూకా తదితరులు పాల్గొన్నారు.

నాడు అధోగతి.. నేడు అభివృద్ధి

- అభివృద్ధి పథంలో గ్రామాలు
- పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో పనులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు
- తుదిదశకు చేరుకున్న పనులు

బల్లికురవ: గతంలో గ్రామాల్లో సరైన మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది ఎదుర్కొన్నారు. వర్షకాలం వస్తే చాలు వీధుల్లో నీరు నిలబడి ఇబ్బందిగా ఉండేది. అంతర్గత రోడ్లు సక్రమంగా లేక, సైడు కాల్వలు లేక మురుగునీరు ముందుకు కదలక ప్రజలు అవస్థలు పడుతున్నా గత ప్రభుత్వ పాలకులు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టాక సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల వారీగా అభివృద్ధి పనులకు బాటలు వేస్తున్నారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మండల కన్వీనర్ చింతల పేరయ్య, కృషితో మండలంలోని 21 పంచాయతీలు, 13 శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి.

రూ.8.5 కోట్ల మేర పనులు..

మండలంలోని 20 సచివాయాలు, 21 పంచాయతీల్లో రూ. 8.5 కోట్ల మేర వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ తెలిపారు. మండల నిధులతో సైడు కాల్వలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, గడప గడప నిధులతో సైడు కాల్వలు,



కొప్పరపాడులో నిర్మిస్తున్న సైడు కాల్వలు

కల్వర్టులు, గ్రామ పంచాయతీ, 15వ ఆర్థిక సంఘ నిధులతో సైడు కాల్వలు, ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

అధ్వాన స్థితి నుంచి విముక్తి..

గత ప్రభుత్వ పాలనలో కొప్పరపాడు గ్రామంలోని బస్టాప్ నుంచి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు వెళ్లే రోడ్డు 200 మీటర్లు అధ్వాన స్థితితో పాటు సైడు కాల్వలు లేక మురుగు నీరు రోడ్డుపై నుంచే ప్రవహించేది. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి బ్యాంకుకు వెళ్లే ప్రయాణికులు మురు నీటిలో గుండానే వెళ్లాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల నుంచి విముక్తికి ఇటీవల మండల నిధులు రూ. 10 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో రోడ్డుకిరువైపులా సైడుకాల్వలు, సీసీ రోడ్డుగా అభివృద్ధి పరిచే పనులు పంచాయతీ రాజ్ ఏఈ జీ. హనుమంత రావు పర్యవేక్షణలో జరుగుతున్నాయి. బల్లికురవ, ముక్తేశ్వరం, చెన్నుపల్లి, గుంటుపల్లి, కొణిదెన, నక్కబొక్కలపాడు, వేమవరం, గంగపాలెం, కె. రాజుపాలెం గ్రామాల్లో అధ్వానస్థితికి చేరిన రోడ్లు సైడుకాల్వలు అభివృద్ధి చేస్తున్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే వేమవరం, కొప్పరపాడు, కొత్తూరు, ఎస్ఎల్ గుడిపాడు, కొప్పరపాలెం, ఒక్కో పంచాయతీకి రూ. 20 లక్షల నిధులు మంజూరు కాగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరి నాయక్ పర్యవేక్షణలో పూర్తయ్యాయి. కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, బల్లికురవ సచివాలయాలకు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. దీంతో ఎన్నో ఏళ్ల బాధనుంచి బయటపడ్డామని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొప్పరపాలెంలో పూర్తయిన సచివాలయం



వేమవరంలో సైడు కాల్వల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జాప్యం లేకుండా బిల్లులు చెల్లిస్తున్నాం..



పనులకు సంబంధించి ఎంబుక్ రికార్డింగ్ పూర్తికాగానే జాప్యం లేకుండా సంబంధిత కాంట్రాక్టర్ ఖాతాకు బిల్లులు చేస్తున్నాం. గ్రామాలకు మంజూరైన ప్రాధాన్యత భవనాలను పూర్తి చేస్తే ఎంబుక్ రికార్డింగ్ తదుపరి బిల్లు చెల్లింపునకు పంపుతాం. అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను కోరాం.

ఎంపీడీవో సీహెచ్ కృష్ణ

సీసీ రోడ్డు, సైడు కాల్వలు..



బల్లికురవలోని-2 గిరిజన కాలనీలకు సిమెంట్ రోడ్లు, సైడు కాల్వలు, కల్వర్టులను రూ. 20 లక్షలతో నిర్మిస్తున్నారు. గతంలో సైడు కాల్వలు లేక, మురుగు నీరు ముందుకు కదలక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం అభివృద్ధి పనులతో ఇక్కట్లన్నీ తొలగిపోయాయి.

ఏ కోటేశ్వరరావు, బల్లికురవ

అవస్థల నుంచి విముక్తి కల్పించారు..



మా గ్రామంలోని బస్టాప్ నుంచి బ్యాంకుకు వెళ్లే ప్రధాన రోడ్డులో సైడు కాల్వలు లేక మురుగునీరు ప్రవహించటంతో అవస్థలు పడ్డాం. సైడు కాల్వల నిర్మాణంతో సీసీ రోడ్డుగా మార్చే పనులు జరుగుతున్నాయి. బ్యాంకుకు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఇక ఇబ్బందులు తీరినట్లే.

పూరేటి రామకృష్ణ, కొప్పరపాడు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



మేదరమెట్లలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు



వలపర్లలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మేదరమెట్ల: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని ముస్లిం సంక్షేమ సంఘ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో గురువారం మేదరమెట్లలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కలాం అహర్నిషలు దేశం కోసం పాటుపడ్డారన్నారు. ఒక మేధావిగానే కాకుండా రాష్ట్రపతిగా దేశ ప్రగతి కోసం పాటుపడ్డారన్నారని గుర్తు చేశారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని చెప్పారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ఆలీబాబా, రసూల్, సతీష్, ప్రసాద్, కరిముల్లా, బర్కత్‌వలి, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: రాష్ట్రపతిగా, మిసైల్ మ్యాన్‌గా సేవలందించిన ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్టూరు వెంకయ్య ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం తథ్యం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసే విధంగా నాయకులు, కార్యకర్తలు చైతన్యవంతులై ముందుకు సాగాలన్నారు. గతంలో మండల కేంద్రాలకు వెళ్లి కాళ్లరిగేలా తిరిగినా కాని పనులు అయ్యేవి కావని కాని నేడు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవుతున్నాయని ప్రజలు చెప్తున్నారని తెలిపారు. ఇదంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వ్యవస్థ వల్లే సాధ్యమైందన్నారు. ఏనాడూ ఎవరూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరగడం కొందరికి కంటగింపుగా ఉందన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేని ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు మరలా పట్టం కట్టడానికి ఎదురు చూస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రతి లబ్ధిదారుల గడపకు వెళ్లి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందించారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మండల స్థాయి నాయకులు, పార్టీలోని వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ సునీత, వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల టౌన్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు చేరుతున్నాయని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. గురువారం మండలంలోని వాడరేవు సచివాలయం-1, 2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వాడరేవులో నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన సభలో వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత హక్కు పత్రాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. వాడరేవులో మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా షిప్పింగ్ హార్బర్ ఏర్పాటు అవుతుందని, చీరాలకే హార్బర్ తలమానికంగా ఉంటుందన్నారు. తీరప్రాంత అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ఏ రాష్ట్రంలో అమలు చేయలేని విధంగా అమలు చేస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా వివిధ ధ్రువీకరణ పత్రాల మంజూరులో జిల్లాలో చీరాల మండలం మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 14517 సర్వీసులను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, ఏవో సుమతీ, ఏపీఎం సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ రమణారెడ్డి, ఈవోఆర్డీ మురళీబాపూజీ, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, ఆర్‌ఐ శేఖర్, నాయకులు మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, అక్కల శ్రీనివాసరెడ్డి, పి.నారాయణ, ఎం.సువార్త, చావలి వాసు, ప్రేమ్‌చంద్, జేసీఎస్ కన్వీనర్ బుర్ల సాంబశివరావు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మున్సిపల్ నిధులతో అంబేడ్కర్ కాంస్య విగ్రహం

- విగ్రహానికి రూ. 30 లక్షలు కేటాయింపు

చీరాల రూరల్: సుమారు 50 ఏళ్ల క్రితం చీరాల రైల్వే స్టేషన్ ఎదురుగా ముక్కోణం పార్కు సెంటర్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం తొలగింపు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు గురువారం ప్రారంభించారు. పాత అంబేడ్కర్ విగ్రహం స్థానంలో కొత్తగా పన్నెండున్నర అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులతో పాటు ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా తీర్మానించారు. కాంస్య విగ్రహానికి మున్సిపల్ నిధులు రూ. 30 లక్షలు కేటాయించారు. 50 ఏళ్ల క్రితం అప్పటి చీరాలకు చెందిన కొందరు పెద్దలు పూనుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని సెంటర్‌లో నిర్మించారు. విగ్రహానికి ఎదురుగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆయా నాయకుల జయంతి, వర్ధంతుల నిర్వహణ సందర్భంగా ఆయా ప్రాంతాలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకుల సందర్శనలతో కోలాహలంగా మారిపోతాయి.

కాంస్య విగ్రహానికి రూ. 30 లక్షల కేటాయింపు...

పాత అంబేడ్కర్ విగ్రహం స్థానంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పన్నెండున్నర అడుగుల కాంస్య విగ్రహానికి మున్సిపల్ నిధులు రూ. 30 లక్షలు కేటాయించారు. వాటిలో రూ.20 లక్షలు విగ్రహానికి ఖర్చు చేస్తుండగా మిగతా రూ. 10 లక్షలు గ్రీనరీ ఏర్పాటు, విద్యుత్ అలంకరణ, రెయిలింగ్, విగ్రహం బేస్‌మెంట్ ఏర్పాటుకు వినియోగించనున్నారు. పాత అంబేడ్కర్ విగ్రహాన్ని బస్టాండ్ వద్దగల మున్సిపల్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహం కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న చీరాల ప్రజల ఆకాంక్ష నెరవేరనుండడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అంబేడ్కర్ విగ్రహం తొలగింపు పనులు చేస్తున్న సిబ్బంది

- పాత అంబేడ్కర్ విగ్రహం తొలగింపు పనులు మొదలు పెట్టామని నెల రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని డీఈ ఏసయ్య చెప్తున్నారు. కాంస్య విగ్రహాన్ని తెనాలిలో చేయించామని విగ్రహ పనులన్నీ పూర్తయ్యాయని చెప్పారు.

30న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రైతు, కార్మిక సంఘం నాయకులు

మార్టూరు: దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీ విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు జయంప్రదం చేయాలని కార్మిక కర్షక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక గన్నవరం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఈమేరకు పోస్టర్ ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నల్లచట్టాల రద్దుతోపాటు 2020 ఎలక్ట్రిసిటీ బిల్లు రద్దు చేసే వరకు పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో ఆదివారం దేశ వ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో రైతులు, కార్మికులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆర్ వినోద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేడు మహిళా మార్ట్ ప్రారంభం

చీరాల టౌన్: వైఎస్సార్ కాంతి పథకం ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో ఏర్పాటు చేయనున్న మహిళా మార్ట్ శుక్రవారం నుంచి వినియోగంలోకి రానుందని ఏపీఎం బీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాత బైపాస్ రోడ్డులో పొదుపు మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని ఏపీఎం తెలిపారు. మార్ట్‌లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ రకాల చేతివృత్తుల ఉత్పత్తులు, నాణ్యమైన నిత్యావసర సరుకులు తక్కువ ధరలకే విక్రయిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సూచించారు.

స్వయం సహాయక సంఘాలతో ఆర్థికంగా ఎదగాలి

చినగంజాం: స్వయం సహాయక సంఘాలతో మహిళ, దివ్యాంగుల గ్రూపు సభ్యులు ఆర్థికంగా ఎదగాలని భారత్ నిర్మాణ్ వలంటీర్, దివ్యాంగుల గ్రూపు ప్రథమ లీడర్ ఈ గోవిందస్వామి అన్నారు. గురువారం మండలంలోని మున్నం వారిపాలెం దివ్యాంగుల స్వయం సహాయక సంఘం సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల గ్రూపులు బలోపేతం కావాలని, స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలను అందిపుచ్చుకొని ఉపాధిని పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా బలపడాలన్నారు. ఇందులో భాగంగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన గ్రూపు-2వ లీడర్, దివ్యాంగుడు ఎస్ వెంకటేశ్వరరెడ్డికి పాటించి నివాళులర్పించారు. గ్రూపు సభ్యులు అసోది అనిత, అక్కల వేణుగోపాలరెడ్డి, షేక్ మదర్‌సా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్‌కు సత్కారం



జ్యోతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ: కృషి, పట్టుదలతో విద్యతోపాటు పవర్ లిఫ్టింగ్‌లో వరుస పథకాలు సాధిస్తూ పవర్‌ఫుల్‌గా జ్యోతి నిలిచిందని ఎంఈవో రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని వల్లాపల్లి గ్రామానికి చెందిన మేడగం జ్యోతి 2017-18లో పెద అంబడిపూడి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు కైవసం చేసుకుంది. ఆ తదుపరి రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నాలుగేళ్లుగా వరుస పతకాలు సాధించింది. గురువారం పాఠశాలలో విద్యార్థి జ్యోతితోపాటు తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, రమాదేవిలను సత్కరించారు. జ్యోతి 19 బంగారు పతకాలు, నాలుగు బ్రాంజ్ మెడల్స్ నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కే భూషణ్‌పాల్ అన్నారు. జ్యోతిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఈర్తినేని పెద్దన్న, బొల్లినేని వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది నిరసన

చీరాల అర్బన్: న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చీరాల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. ఏపీ పవర్ జేఏసీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డీఏ బకాయిలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, సిహెచ్ దేవదానం, జె.కళ్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



బాలింతకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని డాక్టర్ ఐ.బాబూరావు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చీరాల ఏరియా వైద్యశాలలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది బిడ్డలకు జుబ్బాలు, తల్లులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఏరియా వైద్యశాల సూపరిండెంటెంట్ డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ ఈనెలో 113 మందికి గాను 50 మందికి మాత్రమే అత్యవసరమైన సిజేరియన్ ఆపరేషన్ చేశామని, మిగిలిన వారికి సాధారణ కాన్పులు చేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రామకృష్ణ బి.హేమంత్‌కుమార్, డివి సురేష్, ఎస్వీ స్వామి పాల్గొన్నారు.